


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 23-11-2022 సంపుటి : 04 సంచిక :82 పేజీలు : 4 వెల : రూ 3-00


## కొనసాగుతున్న వాయుగుండం..

ఉరుములు, మెరుపులతో వర్షాలకు అవకాశం



విశాఖపట్నం/ అమరావతి: నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. ఇది గంటకు 25 కిలోమీటర్ల వేగంతో వాయవ్యదిశగా కదులుతోంది.ఇది సోమవారం అర్ధరాత్రి త ర్వాత నుంచి పశ్చిమ వాయవ్యదిశగా పయనిస్తూ దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు వైపు పయనిస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.మంగళవారం ఉదయానికి అల్పపీడనంగా బలహీనపడి దక్షిణాంధ్ర, తమిళనాడు, పుదు చ్చేరి మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల, ఉత్తర కోస్తాంధ్రలో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ భారీవర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి.

## ఎమ్మెల్యేల కొనుగోలు కేసు

హైకోర్టులో విచారణ రేపటికి వాయిదా



హైదరాబాద్: టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసును తెలంగాణహైకోర్టు రేపటికి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు విచారణకు హాజరు కాలేదని హైకోర్టుకు సిట్ స్పష్టం చేసింది.వారికి నోటీసులు ఇచ్చినా హాజరు కాలేదని, ఏదైనా ఆర్డర్ ఇవ్వాలని హైకోర్టును సిట్ కోరింది. బీఎల్ సంతోష్‌కు నోటీసులు అందాయని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారు.సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు, సిట్ విచారణ అంశాలపై రేపు మరోసారి విచారిస్తామన్న హైకోర్టు తన విచారణను వాయిదా వేసింది.కాగా,ఈ కేసు విచారణలో భాగంగా విచారణకు హాజరు కావాల్సి ఉన్న ముగ్గురికి లుకౌట్ నోటీసులు జారీ అయిన సంగతి తెలిసిందే. ఈ కేసులో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కేరళ బీడీజేఎస్ అధినేత తుషార్, కేరళకు చెందిన వైద్యుడు జగ్గుస్వామిలు సోమవారం విచారణకు హాజరు కాలేదు. బీఎల్ సంతోష్ ఆఫీస్‌లో సైతం పోలీసులు నోటీసులు ఇచ్చారు. దీంతో బీఎల్ సంతోష్ తాను వేరే రాష్ట్రంలో పర్యటిస్తున్నాని, అందువల్ల సిట్ ముందుకు వచ్చేందుకు సమయం కావాలని కోరాడు. ఐతే కేరళ వైద్యుడు జగ్గుస్వామి మాత్రం ఇంకా పరారీలో ఉన్నాడు. దీంతో అతను విదేశాలకు పారిపోకుండా తెలంగాణ పోలీసులు అన్ని ఎయిర్‌పోర్ట్‌లను అలర్ట్ చేయడమే కాకుండా విదేశాలకు చెక్కేయకుండా లుకౌట్ నోటీసులు కూడా జారీ చేసింది సిట్.

## త్వరలో జనసేన తీర్థం పుచ్చుకుంటున్నా

మంత్రి బొత్స కీలక అనుచరుడి సంచలన ప్రకటన

అమరావతి నవంబర్ 22ఏపీలో కీలక మంత్రి బొత్స సత్యనారాయణ కీలక అనుచరుడిగా పేరున్న విజయనగరం జిల్లా వైసీపీ నాయకుడు ప్రముఖ వ్యాపార వేత్త గురాన అయ్యలు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే జనసేన తీర్థం పుచ్చుకుంటున్నట్టు వెల్లడించారు.కొన్నాళ్లుగా బొత్సకు దూరంగా ఉంటున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆయన తాజాగా ఏపీ ప్రబుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తాను త్వరలోనే జనసేన తీర్థం పుచ్చుకుంటున్నట్టు వెల్లడించారు.జనసేనాని పవన్ కల్యాణ్తో కలసి ప్రయాణించేందుకు నిర్ణయం తీసుకున్నానని గురాన అయ్యలు తెలిపారు. ఈ నెల19న హైదరాబాద్ పవన్ను మర్యాదపూర్వకంగా కలిశానని వెల్లడించారు.సుపరిపాలన అందించే ఆయన నాయకత్వాన్ని అందరూ బలపరిచే సమయం ఆసన్నమైందన్నారు. త్వరలోనే మంచి ముహూర్తం చూసి ఆ పార్టీలో చేరుతానని గురాన అయ్యలు తెలిపారు. తాను స్వతహాగా మెగా ఫ్యామిలీకి అభిమానినని గతంలో ప్రజారాజ్యం పార్టీలో పని చేసినట్లు తెలిపారు.ఏపీలో అన్యాయమైన స్వార్థపూరిత రాజకీయ పాలనావ్యవస్థను తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. జనసేన సిద్ధాంతాలు పవన్ కల్యాణ్ పోరాటస్ఫూర్తి అందరికీ సమన్యాయం మంచి చేయాలనుకునే పవన్ నాయకత్వం నచ్చిందని తెలిపారు.పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని అందరూ బలపరిచే సమయం ఆసన్నమైందని అన్నారు.

# ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు షాక్



అమరావతి : ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు షాక్ ) ఇచ్చింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీనియర్ రెసిడెన్సీ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ న్యాయస్థానం మంగళవారం ఆదేశాలు ఇచ్చింది. సీనియర్ రెసిడెన్సీ పోస్టుల నియామకాల్లో ప్రైవేట్ మెడికల్ కళాశాల విద్యార్థులను అనుమతించకపోవడంపై డాక్టర్ ఎం.ఝాన్సీరాణి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై ఇవాళ విచారణ జరిగింది. పిటిషనర్ తరఫున లాయర్ జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివిన డాక్టర్లను మాత్రమే అనుమతించడం... డెంటర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆఅఎ) నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనికి సంబంధించిన పత్రాలను న్యాయవాది కోర్టుకు అందించారు. జడ శ్రవణ్ కుమార్ వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ.. దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## అక్రమ ఫుట్ పాత్ లపై నాలుగో రోజు

ఎవరు ఎన్ని చెప్పినా తగ్గేదేలా మున్సిపల్ కమిషనర్



నంద్యాల :-నంద్యాల పట్టణంలో గత నాలుగు రోజు లుగా ఫుట్ పాత్ ల , కాలువలపై ఆక్రమణల తొలగింపు చేపట్టారు. చిరువ్యాపారులు గడువు అడిగినా పట్టించుకోకుండా దుకాణాలు తొలగించారు. అధికార పార్టీ నాయకులవి కట్టడాలను కూడా సైతం వదలడం లేదు. మున్సిపల్ అధికారుల ధైర్య సహసాల పై పాద చారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు . రహదారికి ఇరువైపులా దుకాణాల ముందున్న ఆక్రమణలను గత నాలుగు రోజులుగా తొలగించు తున్నారు . ఫుట్ పాత్ లపై అక్రమంగా నిర్మించిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తొలగించు కోవాలని లేని యెడల మున్సిపల్ అధికారులు అటువంటి వాటిని జేసిబి తో పగలగొడతారని తెలిపారు. ఫుట్ పాత్ లపై . అక్రమ కట్టడాల వల్ల చిన్న పాటి వర్షం వచ్చినా మురుగు నీరు. వర్షం నీరు రొడ్డు మీద పారడం మనము ఆందరము చూస్తున్నాము కావున పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు . నంద్యాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు .

## ఆర్బీఐ తాజాగా నివేదిక విడుదల.. అప్పుల్లో.. అడుగునే

ఏపీ అప్పులు 2022 మార్చికి రూ.3,98,903 కోట్లు
టీడీపీ దిగిపోయే నాటకే రూ.2,70,451 కోట్ల రుణ భారం
ఈ మూడేళ్లలో చేసిన అప్పులు రూ.1.28 లక్షల కోట్లు
రూ.8 లక్షలు.. పది లక్షల కోట్లంటూ.. శ్రీలంకతో పోలుస్తూ
రాష్ట్ర ప్రతిష్టపై ఓ వర్గం మీడియా తరచూ బురద
మన కన్నా దేశంలో ఏడు రాష్ట్రాల్లో అప్పులు అత్యధికం
అప్పుల్లో తమిళనాడు టాప్.. రెండో స్థానంలో ఉత్తరప్రదేశ్
వివిధ రాష్ట్రాల అప్పులను నివేదిక రూపంలో వెల్లడించిన ఆర్బీఐ

అమరావతి: ఒకసారి శ్రీలంకతో పోలుస్తూ.. మరోసారి రూ.పది లక్షల కోట్లంటూ రాష్ట్ర అప్పులపై తమకు నచ్చినట్లు పుంఖాను పుంఖాలుగా ఓ వర్గం మీడియా ప్రచురిస్తున్న కథనాల్లో ఏమాత్రం నిజం లేదని ఆర్బీఐ నివేదిక సాక్షిగా తేటతెల్లమైంది. 2021-22 ఆర్థిక ఏడాది మార్చి నాటికి వివిధ రాష్ట్రాల అప్పులపై ఆర్బీఐ తాజాగా నివేదిక విడుదల చేసింది.ఇన్‌స్టిట్యూషన్లతో పాటు స్టేట్ డెవలప్‌మెంట్ రుణాలు (మార్కెట్ బారోయింగ్), విద్యుత్ బాండ్లు, నాబార్డు, ఇతర బాండ్లు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, కేంద్రం నుంచి రుణాలు, అడ్వాన్స్‌లు, నేషనల్ సెక్యూరిటీ ఫండ్, నేషనల్ కో-ఆపరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిపాజిట్స్ అండ్ అడ్వాన్స్ ద్వారా తీసుకున్న మొత్తం రుణాలను రాష్ట్రాల వారీగా ఆర్బీఐ వెల్లడించింది.అన్ని రకాల రుణాలు కలిపి ఆంధ్రప్రదేశ్ మొత్తం




అప్పులు 2022 మార్చి నాటికి రూ.3,98,903 కోట్లుగా ఉన్నట్లు ఆర్బీఐ నివేదిక స్పష్టం చేసింది. 2019 మార్చి నెలాఖరు నాటికి అంటే చంద్రబాబు పాలన చివరి దశలో రాష్ట్రం అప్పులు రూ.2,64,451 కోట్లుగా ఉన్నట్లు ఆర్బీఐ నివేదిక పేర్కొంది.2019 ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతున్నప్పటికీ చంద్రబాబు సర్కారు ఏప్రిల్ 4వతేదీన ఒకేసారి రూ.4,000 కోట్లు, మే 2వ తేదీన రూ.500 కోట్లు, మే 7వతేదీన 500 కోట్లు, మే 14వ తేదీన రూ.1,000 కోట్లు అప్పులు చేసింది. దీంతో మరో రూ.ఆరు వేల కోట్ల మేర చంద్రబాబు సర్కారు అప్పు చేసినట్లైంది. దీంతో చంద్రబాబు హయాంలో చేసిన అప్పులు రూ.2,70,451 కోట్లకు చేరుకున్నాయి.

అప్పులపై ఆర్బీఐ నివేదిక కంటే ప్రామాణికం ఏదీ ఉండదని ఆర్థిక శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చాలనే దురుద్దేశంతోనే రూ.పది లక్షల కోట్ల అప్పులంటూ ఓ వర్గం మీడియా బురద చల్లుతోందని ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. అప్పులు ఎన్ని ఉన్నాయో ఆర్బీఐ నివేదికలో స్పష్టంగా చెప్పినందున ఇకనైనా తప్పుడు ప్రచారాన్ని ఆపాలని ఆర్థిక శాఖ వర్గాలు సూచిస్తున్నాయి.ఆ రెండు పత్రికలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ తప్పుడు సమాచారాన్ని ప్రచురిస్తున్నాయని పేర్కొంటున్నాయి. నిపుణుల పేరుతో ఓ వర్గం మీడియా వక్రీకరణలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట చేసిన అప్పుల వివరాలను ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ పత్రంలో స్పష్టంగా పేర్కొన్నప్పటి ఆ పత్రికలు పట్టించుకోకుండా కథనాలు అల్లడంపై విస్మయం వ్యక్తమవుతోంది.దేశంలో ఏడు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ కంటే అధికంగా అప్పులు చేశాయని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది.

## చింతూరులో ఘోర రోడ్డు ప్రమాదం..

భద్రాచలం వెళ్లొస్తూ అనంతలోకాలకు



అల్లూరి జిల్లా చింతూరులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ వ్యాన్, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులందరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. భద్రాచలం రామాలయం సందర్శనకు వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా చింతూరులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చింతూరు మండలం బొడ్డగూడెం వద్ద మినీ వ్యాన్, లారీ ఢీకొన్నాయి. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న వారిలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొంత మంది భద్రాచలం రామాలయ దర్శనానికి వచ్చి, తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## సీఎం జగన్‌లో రెండు ముఖాలు.. అవేంటంటే: నాదెండ్ల మనోహర్

సీఎం జగన్మోహన్ రెడ్డిపై జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం జగన్మోహన్ రెడ్డిలో రెండు ముఖాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై తిరగబడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన పార్టీ పొలిటికల్ ఎఫైర్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. విశాఖపట్నం పర్యటనలో ఉన్న నాదెండ్ల మనోహర్ సీఎం జగన్‌పై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. జనసేనకు కాండక్ట్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ నేతలు చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తున్నందుకే తమ పార్టీని రౌడీసేన అంటున్నారని.. ముఖ్యమంత్రి స్థాయి తగ్గించుకుని వ్యాఖ్యలు చేస్తున్నారని నాదెండ్ల మనోహర్ దుయ్యబట్టారు.సీఎం జగన్మోహన్ రెడ్డిలో రెండు ముఖాలు ఉన్నాయని.. బయటకు కనిపించేది ఒకటైతే.. తెరవెనుక మరొకటి ఉందని నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. సీఎం జగన్ ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

## 175లో ఆ ఒక్క నియోజకవర్గానికి భారీ డిమాండ్?



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం 175 నియోజకవర్గాలున్నాయి. అసెంబ్లీ ఎప్పుడు ఎన్నికలు జరిగినా పులివెందుల నుంచి వైఎస్ జగన్ సులభంగా గెలుస్తారని, కుప్పం నుంచి చంద్రబాబు సునాయాస విజయం సాధిస్తారని, హిందూపురం నుంచి టీడీపీ కళ్ళు మూసుకొని గెలుస్తుందనే కొన్ని లెక్కలు నియోజకవర్గాలను బట్టి ఉన్నాయి. అయితే ప్రస్తుతం 175 నియోజకవర్గాల్లో ఒకే ఒక నియోజకవర్గానికి మాత్రం భారీగా డిమాండ్ ఏర్పడింది.అదేమిటంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం. దీనికి కారణం.. పిఠాపురంలో ఉన్న 1,86,682 ఓటర్లలో 75 శాతం ఓటర్లు కాపు సామాజికవర్గానికి చెందినవారు. అది ఈ నియోజకవర్గంలో పోటీచేసే అభ్యర్థుల మీద తీవ్ర ప్రభావం చూపించబోతోంది. అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్ష టీడీపీకన్నా జనసేన తరఫునే ఈ టికెట్ కు డిమాండ్ ఎక్కువగా ఉంది.వాస్తవానికి పవన్ కల్యాణ్ కూడా ఉభయ గోదావరి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లను ఇక్కడినుంచి సాధించి కింగ్ మేకర్ గా నిలవాలని ప్రయత్నిస్తున్నారు. చివరి నిముషంలో తెలుగుదేశం పార్టీతో పొత్తు కుదిరినా పిఠాపురం స్థానాన్ని జనసేనకు కేటాయించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా పవన్ కల్యాణ్ ను ఇక్కడి నుంచి పోటీచేయాలని, సులభంగా గెలిపించుకుంటామని పార్టీ నాయకులు ఆహ్వానిస్తున్నారు. అయితే పవన్ పోటీపై ఇంకా స్పష్టత రాలేదు.

# సంపాదకీయం

బుధవారం 23-11-2022

## చరిత్ర సృష్టిస్తున్న సోలార్

మన దేశంలో సరికొత్త సౌర చరిత్ర ప్రారంభమైంది. దీంతో.. కరంట్ కోసం భవిష్యత్తులో బొగ్గు పైన మరియు శిలాజ ఇంధనాల పైన ఆధారపడాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఈ సంవత్సరంలోని మొదటి 6 నెలల్లో ఇండియా.. సోలార్ పవర్ జనరేషన్ ద్వారా 4.2 బిలియన్ డాలర్ల ఇంధన ఖర్చును తగ్గించుకోగలిగింది. 19.4 మిలియన్ టన్నుల బొగ్గును కూడా ఆదా చేసుకుంది. 2022 జనవరి నుంచి జూన్ వరకు భారతదేశంతోపాటు మరిన్ని దేశాలు సౌర విద్యుత్ వల్ల ఏ మేరకు లాభపడ్డాయో వివరిస్తూ కొత్త నివేదిక విడుదలైంది. : రాత్రిపూట కూడా విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ ప్యానెల్‌ను ఇంజనీర్లు రూపొందించారు. ఇప్పుడు మనం చూసే సోలార్ ప్యానెల్ ఏదైనా పగటిపూట మాత్రమే విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. ఎందుకంటే దానికి సూర్యకాంతి అవసరం. దీనివల్ల బ్యాటరీ ఛార్జ్ అవుతుంది. ఆ బ్యాకప్ నుంచి రాత్రి విద్యుత్‌ని వినియోగించవచ్చు. సౌర ఫలకాల నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్ చాలా పనులను చేస్తుంది. కానీ నిరంతరాయంగా విద్యుత్తు ఉత్పత్తి కాకపోవడంతో రాత్రిపూట కొన్ని పనులు ఆగిపోతున్నాయి. కొత్త యుగం సోలార్ ప్యానెల్స్ ఇలా ఉండదు. దీని నుంచి పగలు, రాత్రి నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయవచ్చు. ఈ కొత్త సోలార్ ప్యానెల్‌ను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఇంజనీర్లు కష్టపడి తయారు చేశారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సరఫరా కోసం ఈ సోలార్ ప్యానెల్ రూపొందించారు. 'ఇండియా టైమ్స్' నివేదిక ప్రకారం.. ఈ కొత్త యుగం సోలార్ ప్యానెల్ పగలు, రాత్రి రెండింటిలోనూ సమానంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. ఈ ప్యానెల్ గురించిన వివరణాత్మక అధ్యయనం అప్లైడ్ ఫిజిక్స్ లెటర్స్ జర్నల్‌లో ప్రచురించారు.ప్రపంచవ్యాప్తంగా గత దశాబ్ద కాలంలో నమోదైన సోలార్ గ్రోత్‌పై మూడు సంస్థలు విశ్లేషణ జరిపాయి. ఆ మూడు సంస్థల్లో ఒకటి.. ఎంబర్. ఇదో ఎనర్జీ థింక్ ట్యాంక్. రెండోది.. 'ది సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్'. మూడో సంస్థ.. 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎనర్జీ ఎకనమిక్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలసిస్'. సోలార్ కెపాసిటీ కలిగిన ప్రపంచంలోని టాప్-10 ఎకానమీల్లో ఐదు ఆసియా ఖండంలోనే ఉన్నట్లు ఈ స్టడీలో తేలింది. ఆ ఐదు ఆర్థిక వ్యవస్థల పేర్లు.. ఇండియా, చైనా, జపాన్, సౌత్ కొరియా, వియత్నాం.ఆసియాలో ముఖ్యంగా ఏడు దేశాలు సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. అవి.. ఇండియా, చైనా, జపాన్, సౌత్ కొరియా, వియత్నాం, ఫిలిప్పీన్స్, థాయ్‌ల్యాండ్. ఈ ఏడు దేశాలు.. సోలార్ పవర్ వల్ల ఈ ఏడాదిలోని మొదటి ఆరు నెలల్లో 34 బిలియన్ డాలర్ల ఇంధన ఖర్చును తప్పించుకోగలిగాయి. ఇది ఈ సమయంలోని మొత్తం శిలాజ ఇంధన వినియోగ ఖర్చులో 9 శాతంతో సమానం. ఈ 34 బిలియన్ డాలర్ల సేవింగ్స్‌లో ఎక్కువ వాటా చైనాదే అని రిపోర్ట్ పేర్కొంది. చైనా కరంట్ డిమాండ్‌లో 5 శాతాన్ని ఈ సౌర విద్యుత్తే తీర్చింది. 21 బిలియన్ డాలర్ల విలువైన బొగ్గు మరియు గ్యాస్ దిగుమతులను కూడా నివారించినట్లు నివేదిక వివరించింది.సోలార్ పవర్ వల్ల ఎక్కువగా ఇంధన ఖర్చులను తగ్గించుకున్న దేశాల జాబితాలో జపాన్ రెండో స్థానంలో ఉంది. ఆ దేశం 5.6 బిలియన్ డాలర్లను ఆదా చేసుకుంది. వియత్నాం 1.7 బిలియన్ డాలర్లను మిగిలించుకుంది. వియత్నాంలో 2018లో సౌర విద్యుత్ ఉత్పత్తి దాదాపు సున్నా టెరా వాట్ అవర్స్ కాగా ఆ స్థితి నుంచి ఈ సంవత్సరం 14 టెరా వాట్ అవర్స్ స్థాయికి చేరుకుంది. ఇది ఆ దేశంలోని మొత్తం విద్యుత్ డిమాండ్‌లో 11 శాతానికి సమానం.థాయ్‌ల్యాండ్ మరియు ఫిలిప్పీన్స్ దేశాల్లో సోలార్ గ్రోత్ మందగించినప్పటికీ ఇంధన ఖర్చులు మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గటం గమనించాల్సిన విషయం. థాయ్‌ల్యాండ్‌లో సౌర విద్యుత్.. కరంట్ డిమాండ్‌ను 2 శాతం మాత్రమే తగ్గించినప్పటికీ శిలాజ ఇంధన వినియోగాన్ని నివారించటం ద్వారా 209 మిలియన్ డాలర్ల కాస్ట్ కటింగ్ జరగటం విశేషం. ఫిలిప్పీన్స్‌లో కూడా అంతే. మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో సోలార్ పవర్ పర్సంటేజీ ఒకటి మాత్రమే. కానీ.. ఇంధన వాడకానికి దూరం చేయటం ద్వారా 78 మిలియన్ డాలర్లను సేవ్ చేయగలిగింది.సౌత్ కొరియాలో మొత్తం కరంట్ ఉత్పత్తిలో సౌర విద్యుత్ వాటా 5 శాతం కాగా అది 1.5 బిలియన్ డాలర్ల విలువైన శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించగలిగింది. ఈ నేపథ్యం లో ఆసియా దేశాలు సోలార్ పవర్ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవటంపై ఫోకస్ పెట్టాలని అభిప్రాయపడ్డారు. సౌర విద్యుత్‌తోపాటు పవన విద్యుత్ వంటి క్లీన్ ఎనర్జీ సోర్సులపై దృష్టి పెట్టడం ద్వారా ఆసియా ప్రాంతంలో ఇంధన భద్రతను సాధించాలని సూచించారు.అదే సమయంలో.. బొగ్గు మరియు గ్యాస్ దిగుమతులు మరీ ప్రియంగా మారాయని, విశ్వసించదగ్గ విధంగా కూడా లేవని విభూతి గార్గ్ అనే నిపుణుడు పేర్కొన్నారు. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాల వైపునకు మరలటం ద్వారా అన్ని వ్యవస్థల ఖర్చులతోపాటు వినియోగదారులపై విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని అన్నారు. అందువల్ల ఇండియా మరియు ఇతర ఆసియా దేశాలు రెనివబుల్ ఎనర్జీ ఎకోసిస్టమ్ నిర్మాణ దిశగా పెట్టుబడులను మళ్లించాలని తెలిపారు.ఇటీవల కొన్నేళ్లుగా ఇండియాలో సోలార్ పవర్ ఉత్పత్తి మరియు వాడకంపై ప్రభుత్వాలు, ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారని, ఈ పరిణామం ఇంధన భద్రతను మెరుగుపరచటమే కాకుండా సౌర విద్యుత్ విప్లవాన్ని తీసుకురావటంసెక్టార్‌ని విద్యుత్ రంగం అనుసరించే పరిస్థితులు నెలకొన్నాయని ఎంబర్ సంస్థ నిపుణు డు ఆదిత్య లొల్లా చెప్పారు. రానున్న పదేళ్లలో ఇండియాలో సోలార్ పవర్ గ్రోత్ శరవేగంగా పరుగులు తీయనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జనసేనాని పైనే భారమంతానా....

విజయవాడ, నవంబర్ 22,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలన్నీ పొత్తుల చుట్టే తిరుగుతోంది. ఇప్పటికే అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సింహంలా సింగిల్‌గానే పోటీ చేస్తామని చెప్తోంది. అంతేకాదు 2024 ఎన్నికల వేటలో మిగిలిన పార్టీలకు ఒక్క సీటు కూడా దక్కకుండా మొత్తం వేటాడేస్తామంటోంది. ఇదిలా ఉంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారం నుంచి గద్దె దించేందుకు విపక్షాలన్నీ వ్యూహరచన చేస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చనివ్వకూడదని అటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఇటు టీడీపీ అధినేత చంద్రబాబు కంకణం కట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే పొత్తులు ఎలా ఉంటాయి అనేదానిపై మాత్రం రాష్ట్ర రాజకీయాల్లో క్లారిటీ రావడం లేదు. ఇప్పటికే బీజేపీతో పొత్తులో ఉన్న జనసేన పార్టీ భవిష్యత్‌లో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పొత్తులు ఉంటాయని జనసేన అవిర్భావ సభలో పవన్ కల్యాణ్ ప్రకటించారు. అనంతరం టీడీపీ కార్యాలయంపై దాడి జరిగినప్పుడు పొత్తులపై చంద్రబాబు సైతం ఆహ్వానం పలికారు. అంతేకాదు విశాఖలో జరిగిన పరిణామాల అనంతరం చంద్రబాబు నేరుగా పవన్ కల్యాణ్ బస చేసిన హోటల్‌కు వెళ్లి మరీ సంఘీభావం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నింటిని పరిశీలిస్తే పవన్ కల్యాణ్‌తో పొత్తు కోసం చంద్రబాబు ఎదురు చూస్తున్నట్లు ఖాయమైపోయింది. అయితే బీజేపీ మాత్రం టీడీపీతో పొత్తు అంటేనే ఒంటికాలిపై లేస్తోంది. అగ్రనాయకత్వం దగ్గర నుంచి రాష్ట్ర నాయకత్వం వరకు ఎవరూ కూడా చంద్రబాబును కలుపుకుని వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ససేమిరా అంటున్నారు. అక్కడితో ఆగిపోవడం లేదు. చంద్రబాబు ఒంటరి అని తెలిపేందుకు అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని కూడా బీజేపీ ఉపయోగించుకుంటుంది. ఒకవైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను హైప్ చేస్తూనే మరోవైపు చంద్రబాబు బలహీనతలను బయటపెడుతుంది. ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు కోసం బీజేపీని వదులుకుంటారా లేక బీజేపీని టీడీపీతో పొత్తుకోసం ఒప్పిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే అమరావతి రాజధాని విషయంలో ఉమ్మడి స్వరం వినిపిస్తున్న విపక్షాలు.. ఇప్పుడు పొత్తుల విషయంలోనూ కలిసి సాగుతాయా లేక బీజేపీ -జనసేన పొత్తు మాత్రమే ఉంటుందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న ఏకైక పొత్తు జనసేన-బీజేపీ మధ్య మాత్రమే. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయి. ఇప్పటికీ ఆ పొత్తు కొనసాగుతుంది. అయితే అది 2024 ఎన్నికల వరకు కొనసాగుతుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇదే తరుణంలో జనసేనతో పొత్తు కోసం టీడీపీ తహతహలాడుతుంది. పాత పొత్తును తిరిగి కొనసాగించేందుకు జనసేన,




టీడీపీ చేస్తున్న ప్రయత్నాలు కూడా రాష్ట్రంలో పొలిటికల్ వేడిని రగిలిస్తున్నాయి. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ల వ్యాఖ్యలను పరిశీలిస్తే భవిష్యత్‌లో టీడీపీ-జనసేనల మధ్య పొత్తు అనివార్యంగా కనిపిస్తోంది. ఈ రెండు పార్టీలు కలిసి పోటీచేస్తేనే వైసీపీకి గట్టిపోటీ ఇవ్వగలమన్న అంచనాకు ఇరు పార్టీల నేతలు వచ్చేశారు. ఈ రెండు పార్టీల మధ్య పొత్తు పొడిచే సూచనలు కనిపిస్తున్నాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల మధ్య రాజకీయ సత్సంబంధాలు కొనసాగుతున్నప్పటికీ బీజేపీ మాత్రం కారాలు మిరియాలు నూరుతోంది. చంద్రబాబు అంటేనే యుద్ధానికి కాలుదువ్వుతుంది. అంతేకాదు పవన్ కల్యాణ్ తమ పార్టీతోనే ఉంటారని ఇతర పార్టీలతో ఉండరని ఢంకా భజాయించి మరీ చెప్తోంది. వైసీపీ వ్యతిరేక ఓటును చీల్చనివ్వమన్న పవన్ కల్యాణ్..చంద్రబాబుతో కలిసేందుకు దాదాపు రెడీ అయ్యారని తెలుస్తోంది. అయితే బీజేపీ మాత్రం ఇందుకు ససేమిరా అంటుంది. దీంతో బీజేపీని కూడా కలుపుకుని వెళ్తారా లేదా అన్నదే ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది. ఇకపోతే రాష్ట్రంలో పొత్తుల లొల్లి గురించి క్లారిటీ రావాలంటే నోరు విప్పాల్సింది జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మాత్రమే. ఇప్పటికే కమలదళంతో కలిసున్న జనసేనాని టీడీపీతో కూడా పొత్తులో ఉంటారా లేక బీజేపీని వదిలి టీడీపీతో జతకడతారా అనేది సస్పెన్స్ గా మారింది.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమే ఒక సంచలనం. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చేసింది. అంతేకాదు ఒక ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించిన టీడీపీ ఏకంగా దేశ రాజకీయాల్లో చక్రం తిప్పింది. అది కూడా బీజేపీతో మైత్రి సంబంధం నేపథ్యంలోనే. ఎన్డీఏలో భాగస్వామ్యంగా వ్యవహరించారు. కన్వీనర్‌గా చంద్రబాబు పని చేశారు. అలా బీజేపీతోనే కాదు జాతీయ స్థాయి నేతలందరితోనూ చంద్రబాబుకు మంచి పరిచయాలు ఉన్నాయి. దీంతో 2014 ఎన్నికల్లో మరోసారి బీజేపీతో కలిసి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చారు. అలాగే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం నరేంద్రమోడీ ప్రధానిమంత్రిగా ఇక్కడ రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో బీజేపీతో పొత్తు మూడునాళ్ల ముచ్చటగానే ముగిసింది. బీజేపీతో చంద్రబాబు విభేదించారు. ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు తెలంగాణ ఎన్నికల్లో బద్ధశత్రువైన కాంగ్రెస్ పార్టీతో కలిసి ఎన్నికలకు వెళ్లారు. ఎన్నికల ప్రచారంలో కూడా ప్రధాని నరేంద్రమోడీని తిట్టిపోశారు. అమిత్ షా, మోడీలపై చేసిన వ్యా?ఖ్యలే ఇప్పుడు చంద్రబాబు కొంపముంచిందని తెలుస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గతంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతుందని తెలుస్తోంది. అందులో భాగంగానే చంద్రబాబును బీజేపీ పొత్తుకు స్వాగతించడం లేదని తెలుస్తోంది. అయితే రాష్ట్రంలో వైసీపీని ఓడించాలంటే ఖచ్చితంగా టీడీపీ మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో టీడీపీతో పొత్తుకు బీజేపీ జాతీయ నాయకత్వాన్ని ఒప్పించే బాధ్యతలు పవన్ కల్యాణ్ తన భుజస్కందాలపై వేసుకున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. బీజేపీ విషయంలో మారిన చంద్రబాబు వైఖరిని ఆ పార్టీ జాతీయ నేతలకు వివరించి పొత్తు కుదిర్చాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ నాయకత్వం చంద్రబాబును స్వాగతిస్తే 2024 ఎన్నికల్లో 2014 సినారియోరిపీట్ అవుద్ది. ఇలా జరగాలంటే జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీసుకోబోయే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. మరి పవన్ కల్యాణ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.జనసేన పార్టీతో కలిస్తేనే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావచ్చనే ఉద్దేశం టీడీపీ నేతల్లో ఉంది. ఇప్పటికే చాలా మంది బహిరంగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేకాదు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో కూడా కలిసి వెళ్తే ఇంకా బాగుంటుందని కొందరు అభిప్రాయపడుతున్నట్లు పొలిటికల్ సర్కిల్‌లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టి వేధిస్తోందని ఈ నేపథ్యంలో కేంద్రం అండదండలు ఉంటే వైసీపీ వేధింపులకు అడ్డుకట్టవేయొచ్చని పలువురు సూచిస్తు?న్నారు. అయితే టీడీపీతో పొత్తుకు బీజేపీ ఒప్పుకోకపోవడంతో కొందరు నేతలు పవన్ కల్యాణ్‌తో వరుస భేటీలు అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీని ఒప్పించే బాధ్యత మీదేనంటూ పవన్ కల్యాణ్‌ను కోరుతున్నారంటూ పొలిటికల్ సర్కిల్‌లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.

## రంగంలోకి దిగిన పీకే టీమ్

విజయవాడ, నవంబర్ 22, నేటి రాజకీయాల్లో వ్యూహకర్తల హవా పెరిగిపోయింది..రాజకీయ పార్టీలు సొంత వ్యూహాలని నమ్ముకుని ముందుకెళ్లడం కంటే..వ్యూహకర్తలని పెట్టుకుని ముందుకెళుతున్నారు. ఈ వ్యూహకర్తల రాజకీయం వైసీపీతోనే మొదలైంది. 2014లో ఓటమితో జగన్..ప్రశాంత్ కిషోర్‌ని వ్యూహకర్తగా పెట్టుకుని 2019 ఎన్నికల్లో సక్సెస్ అయ్యారు. ఆ తర్వాత పీకే టీంని కొనసాగిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో పోటీ ఎవరి మధ్య ?. వైఎస్ఆర్ కాంగ్రెస్, టీడీపీ, జనసేన మధ్య పోటీ ఉంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓటు బ్యాంక్ ప్రకారం చూస్తే ప్రధానంగా వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ మధ్య పోటీ ఉంటుంది. జనసేన డిసైడింగ్ ఫ్యాక్టర్ గా ఉంటుంది. రాజకీయ పార్టీల మధ్య పోరాటం ఇలా ఉంటుంది. కానీ.. ఆ రాజకీయ పార్టీల విధానాలను డిసైడ్ చేస్తున్న థర్డ్ పార్టీల ప్రకారం చూస్తే పోరాటం మాత్రం ప్రశాంత్ కిషోర్ వర్సెస్ ప్రశాంత్ కిషోర్ అని సాగుతుంది. ఎందుకంటే.. ఏపీలోని రెండు ప్రధాన పార్టీలకు ప్రశాంత్ కిషోర్ శిష్యులే స్ట్రాటజిస్టులుగా ఉన్నారు. ఒకరి వ్యూహాలపై ఒకరికి అవగాహన ఉండటంతో వారు ఎత్తులకు పై ఎత్తులు వేసి.. రెండు పార్టీలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. ప్రశాంత్ కిశోర్ స్థాపించిన ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-ప్యాక్)నే మరోసారి వైఎస్ఆర్‌సీపీకి పని చేస్తోంది. ఐతే ఇక్కడ వ్యూహకర్త మాత్రం మారారు. ప్రశాంత్ కిషోర్ బీహార్‌లో సొంత రాజకీయం చేసుకుంటున్నారు. దీంతో ఐప్యాక్ లో కీలక పొజిషన్‌లో ఉన్న రిషి రాజ్ ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీ కోసం పని చేస్తున్నారు. ఐప్యాక్ వ్యవస్థాపకుడు అయిన ప్రశాంత్ కిషోర్ ఆలోచనల్ని పక్కాగా అమలు చేస్తారు రిషిరాజ్. అందుకే ఆయనకు స్ట్రాటజిస్ట్‌గా బాధ్యతలు అప్పగించింది. అధికారికంగా ఐ ప్యాక్ కోసమే పని చేస్తున్నా.. మొత్తం రిషి రాజ్ కనుసన్నల్లో వైఎస్ఆర్‌సీపీ స్ట్రాటజీలు నడుస్తున్నాయి. ఈవెంకు అసలు ఎముకలు ఉన్నాయా..!తెలుగుదేశం పార్టీ తమ వ్యూహక్రతగా రాబిన్ శర్మను నియమించుకుంది. ఇటీవల పార్టీ నేతల సమావేశంలో చంద్రబాబు రాబిన్ శర్మతో మాట్లాడించారు కూడా. రాబిన్ శర్మ.. గతంలో పీకే టీంలో కీలకంగాపని చేసి? తర్వాత సొంత సంస్థ పెట్టుకున్నారు. టీడీపీతో ఒప్పందం చేసుకున్నారు. రాబిన్ శర్మ టీం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ నుంచే పని చేస్తోంది. క్షేత్ర స్థాయిలో ఎవరికీ తెలియని టీములతో పని చేయిస్తున్నాయి. గత కొన్ని నెలలు అనేక సర్వేలు చేస్తూ, టిడిపి ఏ విధంగా జనాల్లోకి తీసుకెళ్లాలని విషయంపైనే సలహాలు, సూచనలు ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. నిజానికి రాబిన్ శర్మతో పాటు టీడీపీ సునీల్ కనుగోలు అనే మరో స్ట్రాటజిస్ట్‌ను కూడా నియమించుకుంది. అయితే ఆయన కాంగ్రెస్‌కు జాతీయ స్థాయిలో పని చేస్తున్నారు. ఈ కారణంగా వ్యక్తిగతంగా టీడీపీ స్ట్రాటజీలపై దృష్టి సారించలేకపోతున్నారు.అందుకే ఆయనతో ఒప్పందం రద్దు చేసుకున్నారు. విశేషం ఏమిటంటే ఆయన కూడా ఐ ప్యాక్ నుంచి వచ్చి వేరే సంస్థను పెట్టుకున్నవారే. రిషి రాజ్,

రాబిన్ శర్మ.. ఒకరి వ్యూహాలకు కౌంటర్‌గా మరొకరు.. స్ట్రాటజీలు రెడీ చేస్తున్నారు. వారిని ఆయా రాజకీయ పార్టీలు ఫాలో అయిపోతున్నాయి. ప్రజలకు కష్టాలు తెలియకుండా మీకు ఇన్ని లక్షలు ఇస్తున్నామని చెప్పేందుకు ప్రతి ఇంటికి ఎమ్మెల్యేలను పంపే కార్యక్రమానికి రిషిరాజ్ వైఎస్ఆర్‌సీపీ కోసం రూపకల్పన చేశారు. దానికి గడప గడపకూ మన ప్రభుత్వం అని పేరు పెట్టారు. దీనికి కౌంటర్‌గా రాబిన్ శర్మ కొత్తగా మనకు ఇదేం ఖర్మ అనే ప్రోగ్రాంను టీడీపీకి అసైన్ చేశారు. ఇదేం ఖర్మ అంటూ.. టీడీపీ నేతలు ఇంటింటికి వెళ్లి? జగన్ రాక ముందు ఏలా ఉందో.. జగన్ వచ్చిన తర్వాత ఎంత ఖర్మ పట్టిందో వివరించనున్నారు. ప్రభుత్వం సృష్టిస్తున్న ఫీల్ గుడ్ వాతావరణం లేదని .. మీ మీద పన్నులు బాదడమే.. మిమ్మల్ని తాకట్టు పెట్టేసి జగన్ లక్షల కోట్లు అప్పు చేసి దుబారా చేయడమో.. లేకపోతే నొక్కేశారని చెప్పడమే ఈ క్యాంపెయిన్ లక్ష్యం. ఏపీలోనే కాదు.. దేశవ్యాప్తంగా ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీల స్ట్రాటజీలను.. ఈ స్ట్రాటజిస్టులు డామినేట్ చేస్తున్నారు. దశాబ్దాల తరబడి రాజకీయ అనుభవం ఉన్నా.. కొత్త తరహా రాజకీయం .. సోషల్ మీడియాలో దుమ్మురేపితేనే.. విజయం లభిస్తోంది. అందుకే అన్ని

## ముత్యపుపందిరి వాహనసేవలో ఆరు ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ



తిరుపతి, నవంబర్ 22 తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన మంగళవారం ఉదయం ముత్యపుపందిరి వాహన సేవలో ప్రచురణల విభాగం ఆధ్వర్యంలో ముద్రించిన ఆరు పుస్తకాలను బోర్డు సభ్యులు శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీ పోకలకు అశోక్ కుమార్, జెఈవో శ్రీ వీరబ్రహ్మం ఆవిష్కరించారు. అనంతరం రచయితలను వారు శాలువతో సన్మానించి శ్రీవారి ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా.విభీషణ శర్మ, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి శ్రీ ఆనంద తీర్థచార్యులు ఉపసంపాదకులు డాక్టర్ నరసింహాచార్య పాల్గొన్నారు. 'ఆనంద సంహిత' 'ఆహ్నికామృతం'అనే గ్రంథాలను డాక్టర్. వేదాంతం విష్ణుభట్టాచార్యులు రచించారు. 'ఆనంద సంహిత'లో శ్రీ విఖనస మహర్షి శిష్యులైన శ్రీ మరిచి మహర్షి రచించిన 20 అధ్యాయాలలో వైఖానస అగమ శాస్త్రానికి సంబంధించిన విషయాలు ఉన్నాయి. విష్ణు పారమ్యం, భగవత్ అర్చన, వైఖానస పూజ విధానం, వైఖానస మహోత్యం తదితర అంశాలు ఉన్నాయి. 'ఆహ్నికామృతం' గ్రంధాన్ని శ్రీ వాసుదేవ భట్టాచార్యులు రచించారు. దీనిని ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పండితులచే పరిష్కరింపజేసి టీటీడీ ముద్రించింది. ఇందులో వైఖానసంలో నిత్య కర్మలను ఎలా నిర్వర్తించాలో వివరిస్తుంది. ఈ గ్రంథం పూర్వభాగంలో శాస్త్ర నియమాలు, ఉత్తర భాగంలో మంత్ర విధానం సవివరంగా వివరించబడ్డాయి. 'మానవత్వం నుండి దివ్యత్వం వైపునకు' అనే గ్రంధాన్ని డాక్టర్ పి.వరలక్ష్మి రచించారు. మానవత్వం నుండి దివ్యత్వం వైపునకు జీవన మార్గం ఏ విధంగా సాగాలని ఈ గ్రంథం వివరిస్తుంది. ' ఏ కంపెండియం నేమ్స్ ఇన్ వాల్మీకి రామాయణం' అనే ఇంగ్లీష్ గ్రంధాన్ని డాక్టర్ వేమిరెడ్డి సులోచన దేవి రచించారు. శ్రీ వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణాన్ని భారతీయ భాషలతో పాటు, ప్రపంచ భాషల్లో కూడా అనేకమంది అనువదించారు. రామాయణంలోని పాత్రలు, విశేషాలు తెలుగులో ఉన్న విధంగానే ఆంగ్లంలో కూడా అనువదించారు. టీటీడీ దాసహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శ్రీ వ్యాసరాజ తీర్థులు కన్నడలో రచించిన కీర్తనలను తెలుగులో అనువదించిన ' దాస సాహిత్య సౌరభము -2' , మైసూరుకు చెందిన శ్రీమతి దీపిక పాండురంగే రచించిన 'సాధ్యి సాధన చరితే' కన్నడ గ్రంధాన్ని ఆవిష్కరించారు.



## టమాట రైతులకు మద్దతుగా సర్కార్

కర్నులు, నవంబర్ 22, దళారుల ప్రమేయం లేకుండా టొమాటో రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని వారి ఆదాయాన్ని పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వ కొత్త ఆలోచన చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ టొమాటో వేల్యూ చైన్ డెవలప్మెంట్‌కు శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ, లారెన్సు డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా లిమిటెడ్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్దన రెడ్డి నేతృత్వంలో ప్రక్రియ పూర్తైంది. దాదాపు 20 వేల మంది టొమాటో రైతులను కవర్ చేస్తూ 20 ఎఫ్.పి.ఓ. లతో ఇంటిగ్రేటెడ్ వేల్యూ చైన్ డెవలెప్మెంట్ జరుగనుంది.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్దే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వినూత్న పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే టొమాటో రైతుల సంక్షేమానికై జగనన్న ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసిందని తెలిపారు. మార్కెట్, దళారుల ప్రమేయం లేకుండా టొమాటో రైతులకు కనీస మద్దతు ధర కల్పించి.. వారి ఆదాయాన్ని పెంచాలనే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ టొమాటో వేల్యూ చైన్ డెవలెప్మెంట్ కు చర్యలు చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్స్ కింద టొమాటో, ఉల్లిపాయ, బంగాళదుంప ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు కాకాణి. గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ జగనన్న ప్రభుత్వం వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఏర్పాటు చేసిందన్నారు. సాధారణంగా డిమాండు, సప్లైకి అనుగుణంగా టొమాటో ధరలో హెచ్చుతగ్గులు ఉందడం వల్ల వినియోగదారులపై, రైతులకు భారంగా ఉంటుందని వివరించారు. టొమాటో ధరలు అధికంగా ఉన్నప్పుడు వినియోగదారులకు ఉపశమాన్ని కల్పించేందుకు, ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా విక్రయిస్తుందని పేర్కొన్నారు.

## అంతు పట్టని కేశినేని వ్యూహం

విజయవాడ, నవంబర్ 22, కేశినేని నాని వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా? విజయవాడ నుంచి పోటీ చేస్తారా? పోటీ చేస్తే ఏ పార్టీ నుంచి? తెలుగుదేశం పార్టీ నుంచా? లేక మరే ఇతర పార్టీల నుంచి బరిలోకి దిగుతారా? లేదా అసలు రాజకీయాలకే గుడ్ బై చెబుతారా? ఇవీ ప్రస్తుతం బెజవాడ టీడీపీ తమ్ముళ్ల మెదళ్లలో నానుతున్న ప్రశ్నలు. కేశినేని నాని ఏ నిర్ణయమైనా ఫాస్ట్ గా తీసుకుంటారు. అది ఆయన నైజం కావచ్చు. తానే మోనార్క్ అని అనుకుంటారు. తన క్రేజ్ వల్లనే రెండు సార్లు గెలిచానని భావిస్తారు. తనంటే జనానికి పిచ్చి అభిమానమని భ్రమిస్తారు. అందుకే ఆయన అప్పుడప్పుడు సంచలన నిర్ణయాలు తీసుకుంటారు.. కేశినేని నాని తన ట్రావెల్స్ ను కూడా అలాంటి ఆవేశంతోనే మూసివేశారు. వేలాది మంది రోడ్డు మీద పడ్డారు. ఇప్పుడు రాజకీయంగా కూడా అంతే. రాజకీయంగా పదేళ్ల నుంచి ఆయన వెంట తిరిగిన అనుచరులకు కేశినేని నాని షాక్ ఇవ్వరన్న గ్యారంటీ అయితే ఏమీ లేదు. ఇటీవల జరుగుతున్న పరిణామాలు కేశినేని నాని మాత్రం టీడీపీ నుంచి పోటీ చేసే అవకాశాలు లేవనే చెప్పాలి. ఆయన పార్టీ హైకమాండ్ కు బాగా దూరమయ్యారు. అనేకంటే .. దూరం చేసుకున్నారు అనుకోవాలి. సహజంగా చంద్రబాబు లాంటి నాయకుడు బలమైన నేతను దూరం చేసుకోరు. ఆ ధైర్యమూ చేయరు. కానీ నాని, చంద్రబాబుకు మధ్య బాగా గ్యాప్ వచ్చినట్లే కనపడుతుంది. చంద్రబాబు ఏ రాజకీయ నేతను తానొవ్వక, నొప్పింపక అన్న రీతిలో వ్యవహరిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే చంద్రబాబు పెత్తనం చెల్లాయిస్తారు తప్పించి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎవరినీ పోగొట్టుకోవాలని ఆయన కలలోనూ కోరుకోరు. అందుకే బుద్దా వెంకన్న, బోండా ఉమ వంటి వారిని దగ్గరకు తీసి ఉండవచ్చు. మరో కారణంగా కేశినేని శివనాథ్ అలియాస్ చిన్నిని కూడా ఆలింగనం చేసుకుని ఉండవచ్చు. పార్టీని ఆర్థికంగా ఆదుకుంటారని కారణం కావచ్చు. కానీ కేశినాని నాని మాత్రం తనను చంద్రబాబు దూరం పెడుతున్నారని భావించి పార్టీకి ఆయన మరింత దూరం అయ్యారు. భారంగా మారారు. వచ్చే ఎన్నికల్లో కేశినేని నానికి టీడీపీ నుంచి టిక్కెట్ దక్కే అవకాశాలు తక్కువే. లోకేష్ కేశినేని చిన్నిని చేరదీయడంతో నానిని పూర్తిగా పక్కన పెట్టినట్లే. మరి కేశినేని నాని ఏ పార్టీలోకి వెళతారు? వైసీపీలోకి వెళ్లే అవకాశాలు తక్కువే. ఇక ఆయనకు మిగిలింది ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే.

# 6 వందల రోజుల స్టీల్ ప్లాంట్ ఉద్యమం

విశాఖపట్టణం, నవంబర్ 22, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు వద్దంటూ ఉద్యోగులు, కార్మికులు ఏకధాటిగా చేస్తున్న ఉద్యమం 600రోజులకు చేరుకుంది . వివిధ వర్గాల నుంచి మద్దతు తీసుకుంటున్న ఉద్యమకారులు... ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగే వరకూ పోరాటాన్ని ఆపేది లేదంటున్నారు. తమ పోరాటం ప్రారంభించి 600 రోజులు పూర్తయిన సందర్భంలో నల్ల జెండాలు, బ్యాడ్జీలతో నిరసన తెలియ జేస్తామంటున్నారు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌గా పిలిచే వైజాగ్ స్టీల్ ప్లాంట్ దాదాపు 26 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని పేరుమీదే విశాఖ నగరానికి ఉక్కునగరం అనే పేరు స్థిరపడింది. ప్రారంభంలో ఏడాదికి 3.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొదలైనస్టీల్ ప్లాంట్ ప్రస్తుతం 7. 3 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. ప్రత్యక్షంగా 17,500 మంది ఉద్యోగులూ, పరోక్షంగా లక్ష మంది ఈ స్టీల్ ప్లాంట్ పై ఆధారపడి పని చేస్తున్నారు. ఈ సంస్థ నష్టాల్లో ఉందంటూ కేంద్ర ప్రభుత్వం తన వాటాను ఉపసంహరించుకోవాలని నిర్ణయించడంతో ఏడాది క్రితం ఆందోళనలు మొదలయ్యాయి. స్టీల్ ఉత్పత్తుల్లో అనేక రికార్డులు సాధించిన స్టీల్ ప్లాంట్ 2015 నుంచి వరుసగా నష్టాలను చవిచూస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని కార్మిక సంఘాలు అంటున్నాయి. జిందాల్ లాంటి ప్రైవేటు సంస్థలకు గనులను కేటాయించిన ప్రభుత్వం... విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రం ఆ పని చేయడం లేదు. సొంత గనులు లేకపోవడంతో ముడి ఖనిజాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. దీంతో గత కొన్నేళ్లుగా సంస్థ నష్టాలను నమోదు చెస్తోంది. దీన్ని సాకుగా చూపించి కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను పూర్తిగా ప్రైవేటు పరే చేయాలని రంగం సిద్ధం చేసిందినిజానికి 2015 వరకూ స్టీల్ ప్లాంట్ పరిస్థితి బానే ఉంది. కానీ ఉక్కు పరిశ్రమలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు, ఐరన్ ఓర్‌ను ప్రైవేటుగా కొనుగోలు చెయ్యాల్సిన పరిస్థితి రావడంతో 2015-16 నుంచి 2020 వరకూ 5 వేల కోట్లు వరకు నష్టం వచ్చిందని కేంద్రం అంటుంది. ప్లాంట్ ఆధునికీకరణ, విస్తరణ చేపట్టడం వలన కూడా ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. దేశంలో స్టీలుకు డిమాండు పెరుగుతుండటంతో భవిష్యత్తులో మళ్లీ లాభాల బాటపట్టే అవకాశం ఉంది. కానీ సరిగ్గా ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు సిద్ధమైంది. సమస్యకు పరిష్కారం చూపించాల్సింది పోయి సంస్థను అమ్మేస్తామనడం సరికాదని స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు అంటున్నారు.స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఆంధ్రులు చేసిన త్యాగాలు అన్నీ ఇన్నీ కావు . 1971లో ఈ సంస్థ కోసం 64 గ్రామాల నుంచి దాదాపు 26 వేల ఎకరాల భూమిని సేకరించారు. ఇదిగాక కురుపాం జమిందార్ 6వేల ఎకరాలను విరాళంగా ప్రకటించారు. భూములు ఇచ్చిన కుటుంబాల్లో సగం మందికే ఇక్కడ ఉద్యోగాలు ఇవ్వగలిగారు. అయినప్పటికీ విశాఖ స్టీల్ ప్లాంట్ అంటే అది అందరిదీ అనే అభిప్రాయంతో ప్రజలు సర్దుకుపోయారు. ప్రతీ ఏటా వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి టాక్సుల రూపంలో వేలకోట్లు కేంద్ర ప్రభుత్వానికి చేరుతున్నాయి. అయినప్పటికీ నష్టాల వంక చూపి స్టీల్ ప్లాంట్ ను అమ్మెయ్యాలని కేంద్రం చూస్తుంది .వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం దానికి ఉన్న భూములే అంటారు ఇక్కడి కార్మికులు. ప్లాంట్ విస్తరణ, భవనాల నిర్మాణం పోగా ఇంకా 8 వేల ఎకరాల భూమి స్టీల్ ప్లాంట్‌ది ఖాళీగా ఉంది. దాన్ని చేజిక్కించుకునేందుకే ప్రైవేటు కంపెనీలు స్టీల్ ప్లాంట్ పై కన్నేసాయనేది వారి వాదన. వీటి విలువ దాదాపు లక్ష కోట్ల వరకూ ఉండడంతో వాటిపై ఆధిపత్యం కోసమే ఈ కుట్ర జరుగుతుంది అంటారు వాళ్ళు. విచిత్రంగా ఇప్పుడు కేంద్రం వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను అమ్మాలని చూస్తున్న పోస్కో కంపెనీ గతంలో ఒడిశాలో ప్లాంట్ కోసం ప్రయత్నిస్తే ప్రాజాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మరి అదే కంపెనీకి వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఎలా అప్పగిస్తారని కేంద్రాన్ని అడిగితే మాత్రం జవాబు లేదని ఉద్యోగ కార్మిక సంఘాలు అంటున్నాయి . వైజాగ్ స్టీల్ ప్లాంట్ అనేది కేవలం ఒక ప్రాంతానికి చెందినది కాదు. దీని ఏర్పాటు కోసం ఆంధ్రులంతా ఏకతాటిపై పోరాటం చేశారు. 1966లో గుంటూరు ప్రాంతానికి చెందిన టి.అమృతరావు విశాఖలో దీక్ష ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో దీనిలో పాల్గొన్నారు. తరగతుల బహిష్కరణ, ఆందోళనలతో నిరసనలు పెద్ద ఎత్తున సాగాయి. రాజకీయ పక్షాలు కూడా విద్యార్థులకు మద్దతుగా నిలిచాయి. 1966 నవంబర్ 1వ తేదీన విశాఖపట్నంలో విద్యార్థులు చేపట్టిన భారీ ర్యాలీని చెదరగొట్టేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఇందులో 9మంది మరణించారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా ఉమ్మడి రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ఆందోళనలు జరిగాయి. అవి కూడా పోలీసు కాల్పులకు దారితీశాయి. ఈ కాల్పుల్లో అదిలాబాద్, వరంగల్, విజయవాడ, విజయనగరం, తగరపువలస, కాకినాడ, సీలేరు, గుంటూరులలో మొత్తం 23 మంది మరణించారు. విశాఖతో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా తెలుగువాళ్ళ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ని ఎవరో ప్రైవేట్ కంపెనీకి అప్పజెప్పుతాం అంటే ఊరుకునేది లేదని అందుకే ఈ ఉద్యమం మొదలు పెట్టామని స్టీల్ ప్లాంట్ ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. ఒక పక్క ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే మరోవైపు స్టీల్ ప్లాంట్‌ను ఈ ఏడాది లాభాల బాట పట్టించారు సంస్థ ఉద్యోగులు. గతంతో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఉక్కుకు డిమాండ్ పెరగడంతోపాటు, విశాఖ ఉక్కుకు నాణ్యతపరంగా దేశవిదేశాల్లో మంచిపేరు ఉండడం దీనికి కారణం. ఇప్పటికే 57 కంపెనీలతో స్టీల్ అమ్మకంపై ఒప్పందాలు కూర్చుకోగా వాటిలో 30కి పైగా పూర్తి మొత్తం అడ్వాన్స్‌గా తీసుకుని స్టీల్‌ను ఉత్పత్తి చేస్తుండడంతో మళ్ళీ ఆదాయం రావడం మొదలైంది. యాజమాన్య అధికార లెక్కల ప్రకారమే 2021లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ 18వేల కోట్ల రూపాయల టర్నోవర్ నమోదు చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పడ్డాక ఈ స్థాయి గణాంకాలు నమోదు చెయ్యడం ఇది రెండోసారి. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో స్టీల్ ప్లాంట్ 13శాతం వృద్ధి నమోదు చేసింది. చివరి నాలుగు నెలల్లో 740 కోట్ల రూపాయల నికర లాభం నమోదైంది. మార్చిలో లక్షల 11 వేల టన్నుల ఉక్కును 3 వేల 300 కోట్ల రూపాయలకు విక్రయించారు. గత మార్చి లో అయితే కర్మాగారం చరిత్రలో అత్యధిక ఆదాయం వచ్చింది. గత గరిష్టంతో పోల్చుకుంటే ఇది 42శాతం అధికం. దీనితో ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ నమోదు చేస్తున్న లాభాలను దృష్టిలో పెట్టుకునైనా ప్రవేటీకరణ ఆలోచన మానుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం నియమించిన కమిటీ ఈ అంశాలను పరిగణనలోనికి తీసుకుంటుందని

వారు భావిస్తున్నారు .మొదట్లో వీరి ఉద్యమం నెమ్మదిగా మొదలైనా ,ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల మద్దతు వీరికి ఉంది. ప్రారంభంలో ఆచితూచి వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పుడు స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకుంటామని, అవసరమైతే తామే కొంటామని హామీ ఇచ్చింది. త్వరలోనే శుభవార్త వింటారని కూడా చెప్పడం విశేషం. ఇక ప్రతిపక్ష టీడీపీ కూడా స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తోంది. ఆ పార్టీ కి చెందిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు అయితే ఏకంగా రాజీనామా వరకూ వెళ్లారు. జనసేన, వామపక్షాలు కూడా ఈ అంశంలో కార్మికుల ఉద్యమానికి సపోర్ట్ ఇస్తూనే ఉన్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రైవేటీకరణ చెయ్యక తప్పదు అంటూ చెబుతుంది. జీవీఎల్ నరసింహారావు లాంటి బీజేపీ ఎంపీలు మాత్రం మంచే జరుగుతుంది అంటున్నారు. దానితో స్టీల్ ప్లాంట్ అమ్మకం వ్యవహారంలో అంతర్గతంగా ఏదో జరుగుతుంది. ప్రైవేటీకరణను ఆపొచ్చు అన్న ఆశాభవంలో ఉన్నారు ఉత్తరాంధ్ర ప్రజలు. ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకూ ఉద్యోగుల్లో సగం మంది విధుల్లో ఉంటే మరికొంతమంది స్టీల్ ప్లాంట్ ముఖ ద్వారం వద్ద ధర్నాలు చేస్తున్నారు. ఇలా ఏడాది పొడుగునా ఎన్ని కష్టాలు ఎదురైనా వారు తమ దీక్షను మాత్రం వదిలి పెట్టలేదు . ఒకవేళ కేంద్ర ప్రభుత్వం తమ పట్టు వీడక పోతే మాత్రం తమ ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామంటున్నారు వారు. ఢిల్లీలో రైతు ఉద్యమం విజయవంతం అయినట్టుగానే తమ పోరాటం కూడా సక్సెస్ అవుతుందని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగుతుందని కార్మిక, ఉద్యోగ సంఘాలు గట్టి నమ్మకంతో ఉన్నారు. అదే నమ్మకం తో గత 600 రోజులుగా తమ ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు వారు

## ముత్యపుపందిరిపై బకాసుర వధ అలంకారంలో అలమేలుమంగ

తిరుపతి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన మంగళవారం ఉదయం ముత్యపుపందిరి వాహనంపై బకాసుర వధ అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు వాహనసేవ సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు. ముద్దులొలికించే ముత్యాలు అలిమేలుమంగకు ప్రీతిపాత్రమైనవి. స్వాతికార్తెలో వాన చినుకులు సాగరంలోని ముత్యపుచిప్పల్లో పడి మేలుముత్యంగా రూపొందుతాయని, ఏనుగుల కుంభస్థలాల్లో ఉంటాయని అంటారు. అటువంటి ముత్యాలను అమ్మవారి నవ్వులకు, చూపులకు, మాటలకు, సిగ్గులకు ప్రతీకలుగా అన్నమయ్య తన కీర్తనల్లో తెలియజేశారు. తెల్లని చల్లని ముత్యపు పందిరిపై ఊరేగుతున్న అలమేలుమంగను సేవించిన భక్తులకు తాపత్రయాలు తొలిగి, కైవల్యం చేకూరుతుందని విశ్వాసం. మధ్యాహ్నం 12.30 నుండి 2.30 గంటల వరకు శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, గంధంతో అభిషేకం చేస్తారు. కాగా సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్సేవ వైభవంగా జరగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు సింహ వాహనంపై శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులను కటాక్షించనున్నారు. వాహనసేవల్లో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యంగార్, చిన్న జీయ్యంగార్, చంద్రగిరి ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ దంపతులు, జెఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఆగమ సలహాదారులు శ్రీనివాసచార్యులు, విఎస్వోలు మనోహర్, బాలి రెడ్డి, ఏఈవో ప్రభాకర్ రెడ్డి , ఆర్జితం ఇన్స్పెక్టర్ దాము పాల్గొన్నారు.

## నిందితులకు సెక్యూరిటీ కల్పించాలి

నెల్లూరు థావోస్ కి వెళ్లి జగ్గూభాయ్ ఏం పీకాడు. బేగంపేట ఎయిర్ పోర్టు నుంచే వెళ్లాల్సిన అవసరం ఏమిటి? గన్నవరం ఎయిర్ పోర్టులో స్పెషల్ ఫ్లైట్ ల్యాండ్ కాదా? పెద్ద ఎత్తున నల్లధనం, బంగారం తరలించేందుకే బేగంపేట నుంచి వెళ్లారని - టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపించారు. జగ్గూభాయ్ థావుస్ పర్యటనలో మూడు రోజులు మాయమయ్యాడు. అరబిందో వాళ్లని జగ్గూభాయ్ కలిశాడా? లేదా? జగ్గూభాయ్ మాఫియాతో మంత్రులు, ఎమ్మెల్యేలకి సంబంధాలున్నాయి. ఈడీ విచారణలో రిమాండ్ ఖైదీగా ఉన్న శరత్ చంద్రారెడ్డిని, ఎమ్మెల్యే చెవిరెడ్డి ఎందుకు కలిశారు? బాబాయ్ ని చంపిన గొడ్డలికి ఇంకా రక్తం మరకలు ఆరలేదని బెదిరించడానికా, జగ్గూభాయ్.. అమిత్ షా కాళ్లుపట్టుకుని అయినా కాపాడతాడని చెప్పడానికా? రిమాండ్ ఖైదీగా ఉన్న శరత్ చంద్రారెడ్డితో, ఎమ్మెల్యే చెవిరెడ్డిని ఈడీ, సీబీఐ అధికారులు ఎలా కలవనిస్తారు? శరత్ చంద్రారెడ్డి ప్రాణాలకి జగ్గూభాయ్ మాఫియా వల్ల ప్రాణహాని ఉంది. ఈడీ, సీబీఐ అధికారులు వెంటనే జెడ్ క్యాటగిరీ సెక్యూర్టీ కల్పించాలి. మద్యం గురించి అడిగితే, హెరిటేజ్ పాల గురించి మాట్లాడుతారు. ఓరేయ్... మద్యానికి, పాలకి ఏమైనా సంబంధం ఉందారా? అథానీ డిస్టలరీస్ నుంచి రూ.వందకోట్లు చేబదులు ఎందుకు తీసుకున్నారని అన్నారు.

## కళ్లు తెరిచిన లక్ష్మీ దేవి

రాజమండ్రి, నవంబర్ 22, సనాతన హిందూ ధర్మానికి నెలవు భారత దేశం. దేవుళ్ళనే కాదు.. ప్రకృతిలోని జంతువులను, పక్షులను కూడా అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే సంప్రదాయం హిందువుల సొంతం. దేవుళ్ళకు మహిమలున్నాయని భావిస్తారు.. అందుకు ఉదాహరణగా వినాయకుడు పాలు తాగడం, పాము శివుడికి పూజ చేయడం.. ఆవు గుడి చుట్టూ ప్రదక్షిణ చేయడం వంటి అనేక సంఘటనలను రుజువుగా చూపిస్తారు. ఈ నేపథ్యంలో పవిత్ర కార్తీక మాసం వేళ ఉమ్మడి తూర్పుగోదావరి జిలాల్లో వింత సంఘటన చోటు చేసుకుంది.జిల్లాలోని కడియం మండలం కడియపులంక చింతలోని ఓ ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహం కళ్ళు తెరిచింది. సాధారణంగా దేవతా విగ్రహాలు కళ్లు మూసి ఉన్నట్లుగాని, సగం మాత్రమే తెరిచి ఉన్నట్టుగా ఉంటాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం కార్తీక మాసం నడుస్తోంది. నవంబరు 21న ఆఖరి కార్తీక సోమవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ క్రమంలో కడియపులంకలోని లక్ష్మీదేవి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారు కళ్ళు తెరిచి ఉండటం అంతరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.ఈ వార్త క్షణాల్లో దావానలంలా ఆ ప్రాంతమంతా వ్యాపించడంతో భక్తులు ఆ వింతను చూడటానికి పోటెత్తారు. కళ్లుతెరిచి దర్శనమిచ్చిన లక్ష్మీ అమ్మవారిని దర్శించుకునేందుకు పోటీపడ్డారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం రోజున ఈ వింత చోటు చేసుకోవడంతో మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## ప్రాణాల మీదకు డేంజరస్ స్టంట్

విజయవాడ, నవంబర్ 22, డేంజర్.. యమ డేంజర్.. అయినా.. సెల్ఫీల కోసం వేట.. సోషల్ మీడియాలో లైక్‌లు, వ్యూస్ కోసం ఆట.. కొంచెం అటు ఇటు అయితే ఏమౌతుందో తెలుసా.. ప్రాణమే పోతుంది. ఇక్కడా అదే జరిగింది. సోషల్ మీడియాలో లైక్‌లు రావాలన్నది సాయికృష్ణ ఆరాటం. ఇందుకోసం డేంజర్ స్టంట్ చేశాడు. ఏకంగా ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు. ఈ షాకింగ్ ఘటన ఏపీలోని కృష్ణాజిల్లా ఉయ్యూరులో చోటుచేసుకుంది. సినిమా ఫక్కీలో హైవేపై విన్యాసాలు చేసిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఉయ్యూరు బైపాస్ రోడ్డులో 20 రోజుల క్రితం సాయికృష్ణ ద్విచక్రవాహనంతో డేంజర్ స్టంట్ చేశాడు. ఈ క్రమంలో పట్టు తప్పింది.. ప్రమాదవశాస్తూ కిందపడ్డాడు. అంతే కట్ చేస్తే.. హాస్పిటల్ బెడ్ ఎక్కాడు. 20 రోజులపాటు మృత్యువుతో పోరాడాడు. సాయికృష్ణ ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు అన్ని ప్రయత్నాలు చేశారు. కానీ ఆ ప్రయత్నాలేవి ఫలించలేదు. చివరకు చికిత్స పొందుతూ.. ప్రాణాలు కోల్పోయాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.సాయికృష్ణ బైక్‌పై నిలబడి స్టంట్ చేశాడు. ఈ క్రమంలో బైక్ పట్టు తప్పింది. నేరుగా సాయికృష్ణ రోడ్డుపై పడిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. హుటాహుటిన అతన్ని ఆసుపత్రికి తరలించారు. మెదడుకు బలమైన దెబ్బ తగలడంతో సాయి మృతి చెందినట్లు వైద్యులు పేర్కొంటున్నారు. గౌరి సాయికృష్ణ మృతి ఉయ్యూరు పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తల్లితండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చిందిఉయ్యూరు

## లీగల్ ఎయిడ్ క్లినిక్ విజిట్, మరియు ప్రభుత్వ బాలుర వసతి గృహము విజిట్.....



కడప:: కడప కోర్టు లోని శ్రీమతి ఎస్.కవిత, సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు కడప నగరం ప్రభుత్వ పరిశీలనా గృహం నందు ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. లీగల్ ఎయిడ్ క్లినిక్ విధి విధానాలను తెలియజేశారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. రిజిస్టర్స్ ను పరిశీలించడం జరిగినది.అనంతరం జడ్జిగారు ప్రభుత్వ బాలుర వసతి గృహము ను విజిట్ చేయడం జరిగినది. పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలను పరిశీలించారు. పిల్లల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు వహించాలని పర్యవేక్షణ అధికారికి తెలియజేశారు. పిల్లల విద్యా విషయంలో ఉపాధ్యాయులు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 గురించి వివరించారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహము పర్యవేక్షణ అధికారి, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘంటసాల శతజయంతి వేడుకలను విజయవంతం చేయాలి .-కళానికేతన్ అధ్యక్షులు కోడూరు ఆనందరావు.

నెల్లూరు ఘంటసాల శత జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఘంటసాల కళానికేతన్ అధ్యక్షులు కోడూరు ఆనందరావు పిలుపునిచ్చారు . మంగళవారం చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న ఆదివారం ఉదయం 9 గంటల నుండి కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగే ఘంటసాల శత జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వేడుకల్లో సంగీత నృత్య కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను గాయకులను ఘనంగా సత్కరిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు రాజకీయ నాయకులు అధికారులు పాల్గొంటారన్నార అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ సందర్భంగా ఘంటసాలశతజయంతికి సంబంధించిన బ్రోచర్ను విడుదల చేశారు.



## నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులుగా కొండా అనిల్ కుమార్.



నెల్లూరు, (నవంబర్ 22 మంగళవారం).నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులుగా కొండా అనిల్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు .ఈ సంధర్భంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు.రత్నం నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా కొండా.అనిల్ కుమార్ నియామకాన్ని అధికారికంగా మీడియా సమావేశంలో ప్రకటించారు.నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కలిగివున్న నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న కొండా.అనిల్ కుమార్ సేవలను నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పోరాటాలకు,మరియు అరుంధతీయుల (మాదిగ) హక్కులను కాపాడేందుకు ఉపయోగపడే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పరిసిపోగు.శ్రీనివాసులు ఇదే అంబేద్కర్ భవన్లో ఇందిరాగాంధీ జయంతి రోజున నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నెల్లూరు అధ్యక్షుడిగా కొండా.అనిల్ కుమార్ ని ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు.పరిసిపోగు.శ్రీనివాసులు ఆదేశాలను,కొండా.అనిల్ కుమార్ సేవలను గౌరవిస్తూ పత్రికవి లేకరుల సమావేశంలో అధికారికంగా ప్రకటిస్తున్నామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదురు.రత్నం తెలియజేసారు.అనంతరం నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నెల్లూరు జిల్లా నూతన అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ తనను నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నెల్లూరు జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నవ్యాంధ్ర ఎమ్మార్పీఎన్ రాష్ట్ర అధ్యక్షులు పరిసుపోగు.శ్రీనివాసులుకి మరియు నవ్యాంధ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు.రత్నం గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పై కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేపల్లి.రమణ రావు, సలహాదారు పవన్ కుమార్,ప్రధాన కార్యదర్శి పర్రి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యపుపందిరిపై బకాసుర వధ అలంకారంలో అలమేలుమంగ



తిరుపతి, నవంబర్ 22 తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన మంగళవారం ఉదయం ముత్యపుపందిరి వాహనంపై బకాసుర వధ అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. అశ్వాలు, వృషభాలు, గజాలు ముందు కదులుతుండగా మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు వాహనసేవ సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి అమ్మవారిని సేవించుకున్నారు.ముద్దులొలికించే ముత్యాలు అలిమేలుమంగకు ప్రీతిపాత్రమైనవి. స్వాతికార్తెలో వాన చినుకులు సాగరంలోని ముత్యపుచిప్పల్లో పడి మేలుముత్యంగా రూపొందుతాయని, ఏనుగుల కుంభస్థలాల్లో ఉంటాయని అంటారు. అటువంటి ముత్యాలను అమ్మవారి నవ్వులకు, చూపులకు, మాటలకు, సిగ్గులకు ప్రతీకలుగా అన్నమయ్య తన కీర్తనల్లో తెలియజేశారు. తెల్లని చల్లని ముత్యపు పందిరిపై ఊరేగుతున్న అలమేలుమంగను సేవించిన భక్తులకు తాపత్రయాలు తొలిగి, కైవల్యం చేకూరుతుందని విశ్వాసం.మధ్యాహ్నం 12.30 నుండి 2.30 గంటల వరకు శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, గంధంతో అభిషేకం చేస్తారు. కాగా సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు సింహ వాహనంపై శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులను కటాక్షించనున్నారు. వాహనసేవల్లో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యంగార్, శ్రీశ్రీశ్రీ చిన్న జీయ్యంగార్, చంద్రగిరి ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, బోర్డు సభ్యులు శ్రీ పోకల అశోక్ కుమార్ దంపతులు, జెఈవో శ్రీ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఆగమ సలహాదారులు శ్రీ శ్రీనివాసచార్యులు, విఎస్వోలు శ్రీ మనోహర్, శ్రీ బాలి రెడ్డి, ఏఈవో శ్రీ ప్రభాకర్ రెడ్డి , ఆర్జితం ఇన్స్పెక్టర్ శ్రీ దాము పాల్గొన్నారు.



## పతకాలే లక్ష్యంగా క్రీడారంగంలో ముందుకెళ్లండి

**- కర్నూల్ ఉపవిద్య శాఖ అధికారి హనుమంతరావు**



కర్నూల్ : విద్యార్థులు పతకాలే లక్ష్యంగా క్రీడా రంగంలో ముందుకెళ్లాలని కర్నూలు ఉపవిద్యా శాఖ అధికారి హనుమంతరావు వ్యాఖ్యానించారు. మంగళవారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక అవుట్డోర్ స్టేడియం నందు నిర్వహించిన ఉమ్మడి జిల్లాల కర్నూల్, నంద్యాల ఆథ్లెటిక్స్, సేపక్ తక్రే,రగ్బీ, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్ ఎంపిక పోటీలను ఆయన కర్నూల్ మండల విద్యాధికారి వినోద్ కుమార్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై ఎంపిక పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఎంపిక పోటీల ద్వారా ప్రతిభను ఉన్న క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయాలన్నారు. కర్నూల్ ఎంఈఓ వినోద్ కుమార్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అందజేస్తున్నామన్నారు. కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి లక్ష్మయ్య గారి అధ్యక్షతన జరిగింది. లక్ష్మయ్య మాట్లాడుతూ కొన్ని క్రీడలు నంద్యాలలో కూడా జరుగుతాయని ఈ రోజు క్రీడలలో ఎంపిక అయిన వారు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంట్టారని, నేషనల్ డేట్స్ వస్తే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘము కార్యదర్శి వెంకటేశ్వర్లు, పుల్లన్న, అధ్యక్షుడు శ్రీనాథ్, నంద్యాల వ్యాయామ సంఘము కార్యదర్శి రవికుమార్, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర టెక్నికల్ కోఆర్డినేటర్ విశ్వనాథ్, అసిస్టెంట్ సీక్రెటరీస్ కిషోర్, శేఖర్ వ్యాయామ ఉపాధ్యాయులు 120మంది, క్రీడాకారులు 1700 మంది పాల్గొన్నారు.

### భూ వినియోగం మరియు భూ వర్గీకరణ వ్యవసాయ అధికారి

నందికొట్కూర్ నవంబర్ 23:వ్యవసాయ గణన 1.0 నిమిత్తం పగిడ్యా ల మండలంలో ఎన్నికైన ముచ్చుమర్రి గ్రామమునకు నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నుండి శ్రీమతి కే అమృత , సూపరిండెంట్ పి జయరాములు. ఎస్ ఎస్ ఓ , ముఖ్య ప్రణాళిక కార్యాలయం నంద్యాల నుండి అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ వసంత కుమారి, మరియు జిల్లా వ్యవసాయ కార్యాలయం నుండి వ్యవసాయ అధికారి కే కళ్యాణ్ కుమార్. మంగళవారం నాడు ముచ్చుమర్రి గ్రామమునకు వచ్చి విచారణకు ఎన్నికైన సర్వే నెంబర్లకు సంబందించి భూ వినియోగం మరియు భూ వర్గీకరణ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్త పరచడమైనది. అందులో భాగంగా ఈ క్రాప్ బుకింగ్ తో అడంగల్ నందు నమోదు చేసిన విస్తీర్ణంకు సరిపోల్చడం జరిగింది

# బ్యాక్ వాటర్ లో అక్రమ చేపల వేట



బద్వేలు , బద్వేలుకు పొరుగునే ఉన్న గోపవరం మండలం సోమశిల ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ లో చాలా కాలంగా అక్రమ చేపల వేట సాగుతుంది బద్వేల్ కేంద్రంగాకొందరు వ్యక్తులు ఈ దందాను కొనసాగిస్తూ కోట్ల రూపాయలు వెనక వేసుకుంటున్నారు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎప్పుడో చేతులు ఎత్తేశారు చేపల వేట నిషిద్ధ కాలంలో సైతం వీరి అక్రమ చేపల వేట కొనసాగుతుంది ఇది అందరికీ తెలిసిన రహస్యమే అక్రమ చేపల వేట సాగించేవారు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ లో ఉండడం సర్వసాధారణమైంది అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ చేపల వేట సాగిస్తున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే నిషిద్ధ వలలతో చేపల వేట సాగుతుంది ఎంతో బహిరంగంగా జరుగుతున్న చేపల వేట పై అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు నిషిద్ధ వలలతో చేపలు పట్టి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి ప్రతి సంవత్సరం కోటానుకోట్ల రూపాయలు గడిస్తున్నారు ఈ వ్యవహారం చాలా సంవత్సరాలుగా జరుగుతుంది సోమేశిల జలాశయంలో స్థానిక మత్స్యకారులు చేపలు పట్టి జీవనం సాగిస్తూ ఉంటారు ఈ ముసుగులో కొందరు విశాఖపట్నం శ్రీకాకుళం కాకినాడ తదితర ప్రాంతాల నుంచి మత్స్యకారులు రప్పించి అక్రమాలకు తేర తీశారు నిషిద్ధ ఆలివ్ వలలను ఉపయోగించి చిన్న చేపలను గుడ్డు దశలోనే ఒడ్డుకు పడేస్తున్నారు దీంతో మత్స్యకారులకు ఉపాధి కోల్పోతున్నారు అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు చేపల వేట నియంత్రించ వలసిన అధికారులు అక్రమ చేపల వేట చేసే వారి వద్ద పెద్ద మొత్తంలో ముడుపులు దండుకొని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్నారు ఇది కూడా అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే పెన్నా నది పై నెల్లూరు జిల్లాలో సోమశిల జలాశయం నిర్మించినప్పటికీ నీటి నిలువ ప్రాంతం కడప జిల్లాలో ఉంది జలాశయంలో ప్రతి సంవత్సరం మత్స్యశాఖ చేప పిల్లలు వదులుతుంది ఈ జలాశయానికి పది కిలోమీటర్ల దూరంలో ఉండే మత్స్యకారులు నిరుపేదలు వారికి చేపల వేట తప్ప మరో ఉపాధి లేదు వారికి మత్స్యశాఖ అధికారులు అనుమతులు ఎప్పుడో ఇచ్చారు జిల్లాలోని గోపవరం ఒంటిమిట్ట నందలూరు మండలాలకు చెందిన దాదాపు 200 మంది పైగా

**చర్యలు తీసుకోవాల్సిన వారు ఎప్పుడో చేతులెత్తేశారు**
**అక్రమ చేపల వేట లో దేవాదాయ శాఖ ఉద్యోగి**
**నిషిద్ధ వలలతో చేపల వేట**
**తిలాపాపం తలా పిడికెడు**
**బద్వేల్ కేంద్రంగా ఎంతోకాలంగా సాగుతున్న చేపల వేట**

మత్స్యకారులకు అధికారులు లైసెన్సులు ఇవ్వడం జరిగింది హైకోర్టు ఆదేశాల మేరకు స్థానికేతరులు కూడా కొంతమందికి లైసెన్సులు ఇచ్చారు నిబంధనల ప్రకారం స్థానిక వలలతో చేపలు పట్టి వాటిని అమ్మి జీవనం సాగించాలి కానీ దానికి పూర్తి విరుద్ధంగా చేపల వేట ఇక్కడ సాగుతుందిసోమశిల జలాశయం అడ్డాగా బద్వేలు ఒంటిమిట్ట కడప ప్రాంతాల చెందిన చేపల లైసెన్స్ కాంట్రాక్టర్లు మరి కొంతమంది వ్యాపారులు మత్స్య మాఫియా నడుపుతున్నారు ఇది కూడా అందరికీ తెలిసిన విషయమే నిబంధనలు ఎప్పుడో సోమేశిల జలాశయంలో తొక్కేశారు కాకినాడ విశాఖపట్నం శ్రీకాకుళం జిల్లాల నుంచి ఎంతో ప్రసిద్ధి పొందిన మత్స్యకారులను ఇక్కడికి తీసుకువచ్చి వారి చేత అక్రమంగా చేపలు పట్టిస్తున్నారు ఇతర జిల్లాల నుంచి ఇలా రప్పించిన మత్స్యకారులను స్థానికంగా నివాసాలు ఏర్పాటు చేసి వారి ద్వారా అక్రమ చేపల వేట సాగిస్తున్నారు అక్రమ చేపల వేట సాగించేవారికి స్థానికంగానే ఆధార్ కార్డులు ఏర్పాటు చేయడం విశేషం కొంతమంది రెవెన్యూ అధికారులు సిబ్బంది వీరికి అన్ని విధాల సహకారం అందిస్తున్నారు ముఖ్యమైన విషయం ఏమిటంటే బద్వేలు దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి అక్రమ చేపల వేటలో ప్రధాన పాత్ర వహిస్తున్నట్లు సమాచారం ఈ విషయాన్ని దేవాదాయ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు బహిరంగంగానే చెబుతుండడం విశేషం అక్రమ చేపల వేట చేస్తున్న వారిలో దాదాపు 80 శాతం మందికి ఎటువంటి లైసెన్సులు లేవు ఆగస్టు చివరి వరకు జలాశయం లో ఎలాంటి చేపల వేట జరగకూడదని మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు కానీ జలాశయంలో చేపల వేట సాగుతూనే ఉంది అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు అక్రమంగా పట్టిన చేపలను పెద్ద పెద్ద వాహనాల ద్వారా బద్వేలు కు తీసుకువచ్చి ఇక్కడ నుండి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు ఆలివ్ వలలుఉ పయోగించడంతో పెద్ద పెద్ద చేపలు తో పాటు గుడ్డు దశ లో ఉన్న చేపలు కూడా ఈ వలలకు చిక్కుతుంటాయి మత్స్యశాఖ వదిలిన షీట్ చేప పిల్లలు ఒడ్డున పడి గిలగిల కొట్టుకోవాల్సిందే ఈ వలలకు టన్నులకొద్ది చేపలు చిక్కుతుంటాయి చేప సైజును బట్టి కిలో 40 నుండి 50 రూపాయల వరకు చెల్లిస్తారు వారు బయట మార్కెట్లో రెండింతలకు అమ్ముకుంటారు ఇక్కడ నుండి గుజరాత్ అహ్మదాబాద్ ఢిల్లీ పశ్చిమ బెంగాల్ హౌరా మహారాష్ట్ర కర్ణాటక తదితర ప్రాంతాలకు వీటిని అక్రమంగా రవాణా చేస్తుంటారు ఈ వ్యాపారం ప్రతిఏటా కొన్ని కోట్ల రూపాయల్లో సాగుతుంది ఇలా జరిగే వ్యాపారానికి ఎలాంటి లెక్కలు ఉండవు చేపల కాంట్రాక్టర్లకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో వీరి అక్రమ వ్యాపారాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలకు వీరు గులాం అవుతారు

## స్వాతి నక్షత్రం పర్వదినాన శ్రీ మద్దులేటి నృసింహా స్వామి వారిని దర్శించుకున్న పట్టణ వాసులు



నంద్యాల :- నంద్యాల తెలుగు పేటలో ఉన్న మద్దిలేటి లక్ష్మి నృసింహస్వామి దేవస్థానం లో మంగళవారం నాడు శ్రీ నృసింహా స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఆలయం లో ఉదయం అర్చకులు మూలమూర్తి “శ్రీ మద్దులేటి నృసింహా స్వామి”× వారి కి పంచామృత అభిషేకం మరియు స్నపన తిరుమంజనం నిర్వహించడం జరిగింది. తదంతరం స్వామి వారి ని వస్త్రాలు అలంకరణలో మరియు వివిధ రకాల పూల మాలలు తో అలంకరించి,నివేదన సమర్పించారు , స్వామి వారి కి మహా మంగళహారతి ఇవ్వడం జరిగింది. భక్తులు స్వామి వారి అభిషేకం లో పాల్గొని, తిలకించి. స్వామి వారి మహా మంగళహారతి మరియు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి

**-----రైల్వే జీఎం హరున్ కుమార్ జైన్**



నంద్యాల :-నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేయాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి రైల్వే జీఎం హరున్ కుమార్ జైన్ ను మంగళవారం కోరారు. నంద్యాల రైల్వే స్టేషన్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.నంద్యాల తిరుపతి ట్రైన్ చెన్నై వరకు కొనసాగించాలని రైల్వే జిఎంను ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి కోరారు.నంద్యాల మూల సగరం నూనెపల్లె, పొన్నపురం, ట్రాఫిక్ రద్దీ తగ్గించడం కోసం అండర్ పాసులు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే స్టేషన్ సుందరికరణ పనులను జీఎం హరున్ కుమార్ జైన్ తనిఖీలు చేశారు.

### దోమల నివారణకు మరో రెండు ఫాగింగ్ మిషన్లు

తిరుపతి తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిదిలోకి మరో రెండు కొత్త ఫాగింగ్ మిషన్లను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణలు మంగళవారం నగరపాలక సంస్థ ప్రాంగణంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగాకమిషనర్అనుపమఅంజలిమాట్లాడుతూతిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిదిలో ఇప్పటికే దోమల నివారణకు ఒక ఫాగింగ్ మిషన్ వుందని, ఇప్పుడు మరో రెండు ఫాగింగ్ మిషన్లను 24 లక్షలు వెచ్చించి కొనుగోలు చేయడం జరిగిందన్నారు.

# బ్రేక్ లేకుండా నయనతార కనెక్ట్ అవుతుందా?




హీరోయిన్ గా నయనతార వెలుగు..జిలుగుల గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలుగు..తమిళ్ భాషల్ని ఏలేసింది. బాలీవుడ్ పిలిచి అవకాశాలిస్తామన్నా చాలా సెలక్టివ్ గా వెళ్తోంది. ప్రస్తుతం బాద్ షా షారుక్ ఖాన్ సరసన జవాన్ లో నటిస్తోంది. ఈ ఒక్క సినిమాతో బాలీవుడ్ అంతటా ఫేమస్ అవుతుందన్న అంచనాలున్నాయి. ఇలా హీరోయిన్ గా నయనతార కెరీర్ గురించి వెనక్కి తిరిగి చూసే పనిలేదు.అయితే హీరోయిన్ ఓరియేంటెడ్ చిత్రాలతోనే బాక్సాఫీస్ ని షేక్ చేయాలని చాలా కాలంగా ప్రయత్నిస్తుంది. ఇప్పటికే కొన్ని హారర్ థ్రిల్లర్ చిత్రాల్లో నటించింది. నటిగా పాస్ అయింది. కానీ చంద్రముఖిలా ఫేమస్ కాలేకపోతుంది. ఆరకమైన సక్సెస్ కోసం ఎంతోకాలంగా వెయిట్ చేస్తోంది. ఈ క్రమంలోనే ఎక్కువగా ఆమె హారర్ జానర్ చిత్రాలే ఎంపిక చేసుకుంటుంది.తాజాగా 'కనెక్ట్' అనే హారర్ థ్రిల్లర్ తో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. త్వరలో రిలీజ కానున్న ఈసినిమా ఎలాంటి బ్రేక్ లేకుండా రిలీజ్ అవుతుంది. ప్రేక్షకుల్ని సీట్ లో కూర్చోబెట్టి భయభ్రాంతులకు గురి చేయాలంటే రిలాక్స్ టైమ్ ఇవ్వకూడదని మేకర్స్ డిసైడ్ అయినట్లు తెలస్తోంది. ఈ సినిమా కేవలం 95 నిమిషాల నిడివితోనే రిలీజ్ అవుతుంది.అంటే గంటన్నర వ్యవధిగల ఇంగ్లీష్ హారర్ సినిమా తరహాలో అన్న మాట. ఈనేపథ్యంలో కనెక్ట్ పై బజ్ క్రియేట్ అవుతుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు సినిమాకి పాజిటివ్ ఇమేజ్ ని తీసుకొచ్చాయి. ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. టెక్నికల్ గా సినిమా హైలైట్ అవుతుందని ఫీడ్ బ్యాక్ వస్తోంది. అయితే 95 నిమిషాల సినిమాని ఇంకా ట్రిమ్ చేయాలని దర్శకుడు భావిస్తున్నాడుట.అలా చేస్తే ఇంకా వేస్టేజ్ ఉంటే తొలగిపోతుందని అంటున్నాడుట. ఇదే విషయాన్ని నయన్ దృష్టికి తీసుకెళ్తే అలా చేస్తే నిడివి మరీ తగ్గిపోతుందని సందేహం చేసిందిట. అయినా తుది నిర్ణయాన్ని దర్శకుడికే వదిలేసినట్లు సమాచారం. మరి 95 నిమిషాల సినిమాని ఇంకా ట్రిమ్ చేస్తారా? అలాగే ఉంచుతారా? అన్నది తెలియాలి. మరి రిలీజ్ తర్వాత ప్రేక్షకులకు 'కనెక్ట్' అవుతుందా అన్నది చూడాలి. అలాగే ఇటీవలే నయన్ పుట్టిన రోజు కానుకగా భర్త విగ్నేష్ శివన్ ఆమెతో మరో లేడీ ఓరియేంటెడ్ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా వచ్చే ఏడాది ప్రారంభం కానుంది.

# సీనియర్ హీరోలు ఏంటీ దూకుడు?

యంగ్ హీరోలు రామ్ చరణ్- ఎన్టీఆర్- ప్రభాస్ - అల్లు అర్జున్ దూకుడు గురించి తెలిసిందే. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో కెరీర్ పరంగా స్పీడ్ చూపిస్తున్నారు. అయితే వీళ్లకు డబుల్ ట్రిపుల్ ఏజ్ ఉన్నా అంతే స్పీడ్ ని కొనసాగిస్తూ సీనియర్ హీరోలు ఆశ్చర్యపరుస్తున్నారు. ఓవైపు అరడజను సినిమాలతో మెగాస్టార్ చిరంజీవి క్షణం తీరిక లేని లైనప్ ని కలిగి ఉంటే నటసింహా నందమూరి బాలకృష్ణ తగ్గేదేలే అంటూ దూకుడు పెంచేస్తున్నారు.



నాగార్జున- వెంకీ కొంత నెమ్మదిగా ముందుకు సాగుతున్నా బాలయ్య- చిరు మధ్య వార్ మాత్రం ఆగడం లేదు. 60 ప్లస్ ఏజ్ లో ఆ ఇద్దరూ ఒకరితో ఒకరు పోటీపడుతూ నటిస్తున్నారు. వరుస సినిమాలను ప్రకటిస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు.మెగాస్టార్ చిరంజీవి 'గాడ్ ఫాదర్' రిలీజ్ తర్వాత బ్యాక్ టు బ్యాక్ రెండు సినిమాలతో బిజీ అయ్యారు. గాడ్ పాదర్ సక్సెస్ ఇచ్చిన కిక్కుతో ఆయన స్పీడ్ మరింత పెంచేసారు. ఓవైపు బాబితో 'వాల్తేరు వీరయ్య' చిత్రీకరణ పూర్తి చేస్తూనే మెహర్ రమేష్ తో భోళా శంకర్ చిత్రీకరణలోను పాల్గొంటున్నాడు. వాల్తేరు వీరయ్య సంక్రాంతి రిలీజ్ ఫిక్సయినందున ముందుగా ఈ సినిమాని వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇంతలోనే మరో ఇద్దరు దర్శకులతోను చిరు కథా చర్చలు సాగిస్తున్నారని సమాచారం ఉంది.ఇంతలోనే నందమూరి కాంపౌండ్ నుంచి హాటెస్ట్ అప్ డేట్ అందింది. నటసింహా బాలకృష్ణ ఒకేసారి రెండు సినిమాలతో ఫుల్ స్వింగ్ లోకి వెళుతున్నారు. ఇటీవల గోపిచంద్ మలినేని దర్శకత్వంలో వీర సింహారెడ్డి చిత్రీకరణను ఆల్మోస్ట్ పూర్తి చేసి మాంచి జోష్ మీద ఉన్న బాలయ్య మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మాణంలో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్ ని ప్రారంభించేందుకు రెడీ అవుతున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 8న ప్రారంభమై..అదే నెల 8 నుంచి 18 వరకు షూటింగ్ చేస్తారు. జైలు సెటప్ లో చిత్రీకరణ జరుపుతారని తెలిసింది.ఈ సినిమా చిత్రీకరణలో ఉండగానే సైమల్టేనియస్ గా మరో సినిమాని వేగంగా పూర్తి చేయనున్నారు. అంతకుముందే డిసెంబర్ 19 నుంచి వీరసింహారెడ్డి షూటింగ్ కి వెళ్లి.. 10 రోజుల పెండింగ్ చిత్రీకరణను పూర్తి చేస్తారు. ఆ తర్వాత మళ్లీ అనిల్ రావిపూడి తో సెట్స్ పైకి వస్తారు. అనిల్ రావిపూడి-బాలయ్య సినిమాలో అర్జున్ రాంపాల్ విలన్ గా నటించనున్న సంగతి తెలిసిందే. కథానాయికల వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ఈ చిత్రానికి ఎస్.ఎస్.తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇక మెగాస్టార్ చిరంజీవి .. బాలకృష్ణ.. నాగార్జున లాంటి స్టార్లు బిగ్ బి అమితాబ్ బచ్చన్.. సూపర్ స్టార్ రజనీకాంత్ లాంటి ఏజ్డ్ హీరోల ప్రయత్నాలతో పోల్చి చూస్తే ఇంకా వెనకబడి ఉన్నారనే చెప్పాలి.

# 'ఆదిపురుష్' బ్యూటీ అందాల ఆరబోత అదరహో



మహేష్ బాబు తో '1 నేనొక్కడినే' సినిమా లో నటించిన ముద్దుగుమ్మ కృతి సనన్ ఆ సినిమా నిరాశ పర్చినా కూడా తెలుగు లో మరో అవకాశం ను దక్కించుకుంది. కానీ తెలుగు లో చేసిన రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. దాంతో బాలీవుడ్ కి పరిమితం అయ్యింది. అక్కడ కాస్త ఆలస్యంగా అయినా స్టార్ హీరోయిన్ రేంజ్ ను దక్కించుకుంది.హీరోయిన్ గా కృతి సనన్ ప్రస్తుతం హిందీలో బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తూ ఉంది. తెలుగు నుండి కూడా ఆఫర్లు వచ్చినప్పటికి కూడా పూర్తిగా హిందీ ఇండస్ట్రీకే ఈ అమ్మడు పరిమితం అయ్యింది. చాలా కాలం తర్వాత ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.తెలుగు లో సినిమాలు చేసినా చేయకున్నా కూడా ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతతో కంటిన్యూ గా సోషల్ మీడియాలో రచ్చ చేస్తూనే ఉంది. ప్రస్తుతం ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు అభిమానులతో పాటు ఫాలోవర్స్ ఫిదా అవుతూనే ఉన్నారు. ఈ ముద్దుగుమ్మ అందాల ఆరబోత విషయంలో ఎప్పుడు కూడా ప్రతి ఒక్కరు నోరు వెళ్లబెట్టేలా చేస్తుంది.తాజాగా ఈ ఫోటోలో థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ ఆకట్టుకుంది. అంతే కాకుండా కవ్విస్తున్నట్లుగా ఫోజ్ ఇచ్చి బాబోయ్ అనిపించింది. రచ్చ చేసినట్లుగా అందాల ఆరబోత చేస్తున్న ముద్దుగుమ్మ కృతి సనన్ సోషల్ మీడియాలో మరింత పాపులారిటీని ఇలాంటి ఫోటోలతో దక్కించుకుంటుంది.ఆదిపురుష్ లో ప్రభాస్ కు జోడీగా సీత పాత్రలో నటిస్తున్న కృతి సనన్ త్వరలోనే బాలీవుడ్ లో ఒక సూపర్ స్టార్ తో నటించేందుకు కమిట్ అయ్యింది. తెలుగు లో కూడా ఈమె మరిన్ని సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. కానీ బాలీవుడ్ పైనే ఈ అమ్మడి యొక్క పూర్తి దృష్టి ఉంది.

# ఇక మారవా..? మరోసారి చెత్త షాట్ ఆడి వికెట్ పారేసుకున్న రిషబ్ పంత్




నేపియర్‌లోని మెక్లీన్ పార్క్ వేదికగా నూజిలాండ్‌తో ఇవాళ (నవంబర్ 22) జరుగుతున్న సిరీస్ డిసైడర్ మూడో టీ20లో టాస్ ఓడిన టీమిండియా తొలుత బౌలింగ్ చేసింది. పేసర్లు మహ్మద్ సిరాజ్ (4/17), అర్షదీప్ సింగ్ (4/37), హర్షల్ పటేల్ (1/28) చెలరేగడంతో న్యూజిలాండ్ తమ కోటా 20 ఓవర్లు ఆడకుండానే 160 పరుగులకు ఆలౌటైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. ఆరంభంలోనే 2 వికెట్లు (ఫిన్ అలెన్ (3), మార్క్ చాప్‌మన్ (12)) కోల్పోయినా, డెవాన్ కాన్వే (59), గ్లెన్ ఫిలిప్స్ (54) జట్టును ఆదుకున్నారు. అయితే వీరిద్దరు 16 పరుగుల వ్యవధిలో ఔట్ కావడంతో న్యూజిలాండ్ పతనం ఆరంభమైంది. వీరి తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన ఏ ఒక్క బ్యాటర్? నిలదొక్కుకోలేకపోయారు. ఏకంగా ముగ్గురు (నీషమ్, మిల్నే, సోధి) డకౌట్‌లు అయ్యారు. డారిల్ మిచెల్ (10) ఒక్కడే రెండంకెల స్కోర్ చేశాడు.అనంతరం 161 పరుగుల ఓ మోస్తరు లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన టీమిండియా.. కివీస్ పేసర్లు సౌథీ (2/27), ఆడమ్ మిల్నే (1/23) ధాటికి 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ ఇషాన్ కిషన్‌ను (10) మిల్నే ఔట్ చేయగా.. మరో ఓపెనర్ రిషబ్ పంత్ (11), శ్రేయస్ అయ్యర్ (0)లను సౌథీ పెవిలియన్‌కు పంపాడు. 6 ఓవర్ల తర్వాత టీమిండియా స్కోర్ 58/3గా ఉంది. సూర్యకుమార్ యాదవ్ (12), హార్దిక్ పాండ్యా (23) క్రీజ్‌లో ఉన్నారు.పంత్.. ఇక మారవా..?టీమిండియా వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ కమ్ వైస్ కెప్టెన్ అయిన రిషబ్ పంత్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ దారుణంగా విఫలమయ్యాడు. ఓపెనర్‌గా అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోలేక మరోసారి చెత్త షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు. టిమ్ సౌథీ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో రెండు, మూడు బంతులకు వరుసగా బౌండరీలు బాది టచ్‌లోకి వచ్చినట్లు కనిపించిన పంత్.. ఆతర్వాతి బంతికే అనవసరపు షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు.ఆ ఓవర్‌లో అప్పటికే రెండు ఫోర్లు వచ్చినా సంతృప్తి చెందక.. సౌథీపై ఎటాకింగ్ చేద్దామని వెళ్లి వికెట్ సమర్పించుకున్నాడు. సౌథీ వేసిన షార్ట్ బాల్‌ను అంచనా వేయలేక క్రీజ్ వదిలి ముందుకు వచ్చి థర్డ్ మెన్‌లో ఉన్న సోధికి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**